# మన సాహితీసంపద

ఆచార్య తుమ్మపూడి కోటేశ్వర రావు

మహి మున్ వాగనుశాశనుండు సృజియింపన్, కుండలీంద్రుండు తన్
మహనీయస్థితి మూలమై నిలువ, శ్రీనాథుండు ప్రోవన్, మహా
మహిముల్ సోముడు భాస్కరుండు వెలయింపన్, సొంపు పాటించు నీ
బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమును, తత్ ప్రాగల్భ్య మూహించెదన్

ఇది భట్టుమూర్తి లేదా రామరాజభూషణుని వసుచరిత్రలో పద్యం. ఈ కావ్యం షుమారు 1570-80 ప్రాంతంలో వచ్చింది. తళ్లికోట యుద్ధంలో (1560) విజయనగరసామ్రాజ్యం విధ్వంసమైనది. అళియ రామరాయలు – శ్రీకృష్ణదేవరాయల పెద్ద అల్లుడు – ఆ యుద్ధంలో మరణించాడు. అతని తమ్ముడు తిరుమలరాయలు వీలైనంత సంపదతో పెనుగొండ పారిపోయి అదే రాజధానిగా రాజ్యపాలన చేసాడు. అతని ఆస్థానకవి ఈ భట్టుమూర్తి.

నన్నయ్యగారి భారతం షుమారు 1050 ప్రాంతంలో వచ్చింది. తర్వాత 500 ఏండ్లకు వచ్చిన భట్టుమూర్తి తననాటికి వచ్చిన ఆంధ్రసాహిత్య వైభవాన్ని అంచనా కడుతున్నాడు.

నన్నయ్యగారు 1050; తిక్కన్నగారు 1250; భాస్కరుడు 1200-50; నాచనసోమన్న 1320-80 ; శ్రీనాథుడు 1400.

ఈ పద్యంలో శ్లేషకోసం పై కవులనే పేర్కొన్నా చెప్పినంతవరకూ యధార్థమే. నన్నయ్య ఈ మహాసాహిత్య ప్రారంభకుడు. కనుక బ్రహ్మ. మోసినవాడు ఆదిశేషుడు (కుండలీంద్రుడు – పాములరాజు, యజ్ఞం చేసినవాడు; సోముడు – చంద్రుడు; భాస్కరుడు – సూర్యుడు. సృష్టి జరిగినాక కాలస్వరూపులై రేయింబవళ్లను కల్పిస్తూ సృష్టిభ్రమణమునకు హేతువైన వారు; శ్రీనాథుడు – శ్రీమన్నారాయణుడు, సృష్టిరక్షకుడు.)

ఇది ఆంధ్రసాహిత్య ప్రపంచం. దానిని స్తుతిస్తున్నాను – అని భట్టుమూర్తి పూర్వకవులను ప్రశంసిస్తున్నాడు.

నన్నయ్య, తిక్కన్నలు భారతం వ్రాసిన కవిత్రయంలో ఇద్దరు. ఎర్రాప్రగ్గడ అరణ్యపర్వం చివర్లో కొంత వ్రాసాడు. ఈయన పేరు చెప్పకుండానే చెప్పినట్లైనది. తర్వాత వచ్చిన భాస్కరుడు తిక్కన్నగారి సమకాలికుడు. రామాయణం వ్రాసాడు. అతనితో పాటు మరి ఇద్దరు కవులున్నారు. మల్లికార్జునభట్టు, హుళక్కి భాస్కరుని కుమారుడు కుమార

రుద్రదేవుడు. వీరు వ్రాసిన రామాయణాన్నే భాస్కర రామాయణమంటారు. తర్వాత విజయనగర ప్రథమ చక్రవర్తి బుక్కరాయల కాలం లోని వాడు నాచన సోమనాథుడు. ఉత్తర హరివంశం వ్రాసాడు. తర్వాత శ్రీనాథుడు వచ్చాడు. కాశీఖండం, భీమఖండం, హర్షనైషధాంధ్రీకరణం, లాంటివి నిర్మించాడు. శ్రీనాథుని తర్వాత శ్రీకృష్ణదేవరాయల యుగం. పెద్దన్న, తిమ్మన్న, ధూర్జటి, రామరాజభూషణుడు, తెనాలి రామకృష్ణయ్య, పింగళి సూరన్నలు వచ్చారు. చివరి ఇద్దరు రామరాజభూషణుని తర్వాతి వారు. అంటే, పై పద్యంలో వీరందరినీ సాహితీనిర్మాతలుగా కీర్తించటమే ఆ మహాకవి చేసిన పని.

సాహిత్యం ఒక దేశ సంస్కృతి, నాగరికతలకు సారం. ఆ దేశం నిర్మించుకొన్న శాస్త్రపాండిత్యం, కళాసంపద, వేదాంతవిద్యాదు లన్నిటినీ కలిపి మనం సంస్కృతి – సంప్రదాయమనుకుంటే దానిని వడకొట్టి తేర్చిన తేనె కళ సాహిత్యం. కాబట్టి ఒక కావ్యాన్ని చదవటమంటే ఒక దేశసంస్కృతిని చదవటం. చరిత్రను, నాగరికతను చదవటం. పూర్వ మహాకవులు ఆ విధంగా కావ్యనిర్మాణం చేసారు. వారు నిర్మించిన సాహిత్యవిద్యను వదలితే మనకు భాష లేదు. భావన లేదు. ఆనాటి మానవనాగరికత అంతా అడుగంటిపోతుంది. కనుకనే ఏ దేశం కూడా తన పూర్వులు తనకిచ్చిన వారసత్వం ఆధారంగా భవిష్యత్తును నిర్మించుకొంటుంది. అది పునాది. దానిపైన మనం ఎన్ని అంతస్తులైనా వేసుకోవచ్చు. ఆ పునాది గట్టిగా వుండాలి. లేకపోతే పై కట్టడం కుప్పకూలిపోతుంది. ఇదే సంప్రదాయమంటే.

మరలా 4,5 వందల ఏళ్లు ఆ నది ముందునకు ప్రవహించింది. 20వ శతాబ్ది రాగానే మరొక మహాకవి జన్మించి తన పూర్వ సాహితీస్రవంతికి ఎదురుగా నిలిచి చూచాడు. సూర్యరశ్మిలో – వెన్నెల్లో తళతళలాడుతూ ప్రవహించటం తోచింది. ఒకే ఒక కేకలాంటి – పద్యం – చెప్పాడు.

ఋషి వంటి నన్నయ్య రెండవ వాల్మీకి
తిక్కన్న శిల్పపు తెనుగుతోట
ఎఱ్ఱన్న సర్వమార్గేచ్ఛా విధాతృండు
పోతన్న తెన్గుల పుణ్యపేటి
శ్రీనాథుడు రసప్రసిద్ధ ధారాధుని
కృష్ణరాయ డనన్య కృతిప్రబంధి
పెద్దన్న వడపోతపెట్టు నిక్షురసంబు
రామకృష్ణుడు సురారామ గజము

ఒకడు నాచన సోమన్న ఉక్కువుండు
చెఱపి పదిసార్లు తిరుగవ్రాసినను మొక్క
పోని ఈ ఆంధ్రకవిలోక మూర్ధమణుల

మధ్గురు స్థానములుగ నమస్కరించి

ఈ పద్యం విశ్వనాథ కవిసమ్రాట్టుల శ్రీమద్రామాయణ కల్పవృక్షంలో పూర్వకవి స్తుతి.

నన్నయ్య నుండి తెనాలి రామకృష్ణుని దాకా వచ్చిన మహాకవి పరంపర – ఏం చేసారో, వారి సాహితీశిల్పసౌందర్యమేమిటో – వారు తనకు గురువులెందుకైనారో – విమర్శిస్తూ చేసిన ప్రస్తుతి.

ఆ కవులను చెప్పటంలో కాలానుగుణ్యత పాటించబడింది. ఐతే నాచన సోమన్న ఎర్రన తర్వాత రావలసిన వాడు చివరకు వచ్చాడు. ఎందుకంటే – అతనిదొక ప్రత్యేక మార్గం. కొందరి దృష్టిలో ఆయన తిక్కన్న గారంత వాడు. సాక్షాత్తు పరమశివుడని చిన్నయసూరి గారు స్తుతించారు. కాకపోతే ఆయనకు ఫాలనేత్రముంది. ఈయన దాచుకొని వచ్చాడు. ఇంతే తేడా. తమాషా ఏమంటే – స, ఉమానాథుడు – సోమనాథుడు అని అర్థం కనుక ఆయన స్తుతి యథార్థమే. ఈయన కావ్యం మీద విశ్వనాథ వారు "ఒకడు నాచన సోమన్న" అని విమర్శ గ్రంథం వ్రాసారు. తర్వాత ఈ వ్యాసకర్త "సంవిధానక చక్రవర్తి" అని విమర్శ వ్రాసాడు. కనుక చివరన పెట్టవలసివచ్చింది ఇది ఆయన ప్రత్యేక కవితాశైలిని బట్టి తప్ప కాలక్రమం కాదు.

ఈ పద్యంలో భట్టుమూర్తి చెప్పని వారు – ఎర్రన్న, పోతన్న, కృష్ణరాయలు, పెద్దన్న, రామకృష్ణుడు. ఎర్రన్న వ్రాసిన కావ్యాలు అరణ్యపర్వపూరణం సరే, హరివంశం, నృసింహపురాణం. మూడూ మూడు శైలుల్లో వ్రాసినందున విశ్వనాథ సర్వమార్గా (కవితాశైలి) ల్లో బ్రహ్మలాగా యధేచ్ఛాసృష్టి చేసి విహరించినవాడన్నారు. తర్వాత పోతన్న భాగవతం వ్రాసాడు. ఆయన తెలుగుజాతి పూర్వజన్మల నుండి తెచ్చుకొన్న పుణ్యపుపంట అది. కృష్ణరాయల ఆముక్తమాల్యద సాటిలేని ప్రబంధమట. పెద్దన మనుచరిత్ర వడపోతపెట్టిన చెరకుపానకం. రామకృష్ణుడు వ్రాసినవి మూడు కావ్యాలు – ఉద్భటారాధ్య చరిత్ర, పాండురంగమాహాత్మ్యం, ఘటికాచల మాహాత్మ్యం. ఇందులో నిలిచింది రెండవ కావ్యమే. ఆ కావ్యశైలి న భూతో న భవిష్యతి. కనుక ఇంద్రుని పట్టపుటేన్గు ఐరావతం లాంటి వాడన్నారు.

వీరందరూ తెలుగుసాహిత్యమన్న గంగను స్వర్గంనుండి క్రిందికి ప్రవహింప చేసిన భగీరథులు కనుక చిరస్మరణీయులు. ఇది కవి తీర్పు.

ఆ కవి మరలా ఆ మహాకవుల సరసన కూర్చోగలవాడు. ఈ స్తుతి బహుశా 1933–34 ప్రాంతంలో వచ్చింది. 1570–80లో భట్టుమూర్తి తనకు ముందున్న భాషను, నిర్మాతలను గురించి చెబితే తర్వాత ఈ మహాకవి ఆ సంప్రదాయస్రవంతిలో ఏ మహాకవి ఏ ఘట్టంలో (రేవులో) నిలబడ్డాడో విమర్శించాడు.

సాహిత్యగంగ ప్రవహిస్తూ పోతున్నది. ప్రతి గ్రామం, పట్టణం దగ్గర ఒక మలుపు తిరుగుతుంది. అక్కడే పుణ్యక్షేత్రం

వస్తుంది. అదే ఘట్టమంటే. దానికి సముద్రపతనం లేదు. సహృదయులైన పాఠకుల హృదయసముద్రమే (ఈ మాట వేదం లోది) పతనస్థానం.

వేయేళ్ల ఈ సారస్వతంలో, ప్రతి వంద ఏండ్లకొక మహాకవి జన్మిస్తూ వచ్చాడు. అతడే రేవు. ఆ రేవులో దిగి మనం స్నానపానాదులాచరిస్తాం. అంటే ఆ రేవులో నీరే ముందూ వెనకా వున్నది. మావూరిదే నని నీవనుకోవచ్చు. కాని అది అందరిదీ. అన్ని రేవులు కలుపుకొంటే తప్ప ఆ మహానది పొడవు, లోతు తెలియదు. ఒకొక్క మలుపులో అందం తెలియదు. ఇవి తెలియకుండా ముందుకుపోవటం సాధ్యం కాదు.

ఈ మహాకవుల సృష్టిని మూడు రకాలుగా విభజించవచ్చు – సుకుమార కావ్యాలు, మధుర కావ్యాలు, ప్రౌఢ కావ్యాలు.

పారిజాతాపహరణం, విజయవిలాసం వంటివి మొదటి తరగతి. రెండవ తరగతికి చెందినవి భాగవతం, మనుచరిత్ర, ధూర్జటి వ్రాసిన శ్రీకాళహస్తి మాహాత్మ్యం. శ్రీకృష్ణదేవరాయలు, నాచన సోమన్న, తెనాలి రామకృష్ణయ్య, విశ్వనాథల కావ్యాలు మూడో తెగకు సంబంధించినవి.

పూర్వకాలంలో ఈ క్రమంలో కావ్య విద్యాబోధ జరిగేది. శతకాలతో ప్రారంభించి పైరీతిగా ఒక్కొక్క మెట్టుగా విద్యార్థిని పైకి ప్రాకించేవారు. ఈ దృష్ట్యా శ్రీకాళహస్తి మాహాత్మ్యం మొదటికావ్యంగా చూడవచ్చు. ఎందుకంటే భాషాసక్తి, అభిరుచి ఏర్పడటం కోసం. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకం కూడా వ్రాసాడు. ఆయన కవితామాధుర్యాన్ని గురించి ఒక ప్రసిద్ధ చాటుపద్యమున్నది.

స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కుల కేల కల్గెనో
అతులిత మాధురీమహిమ – అని కృష్ణదేవరాయలు అని తర్వాతది పూర్తి చేయమని అష్టదిగ్గజాలను కోరినాడట.
అప్పుడు తెనాలి రామకృష్ణుడిలా పూరించాడట –

హా! తెలిసెన్, భువనైక మోహనో
ద్ధత సుకుమార వార వనితా జనతా ఘనతాపహారి సం
తత మధురాధరోదిత సుధారసధారల గ్రోలుటం జుమీ! – అని.

ధూర్జటికి వారకాంతాభిలాష వున్నట్లు – వారి పెదవులందలి సుధారసం త్రావటం వల్ల ఆ మాధుర్యం ఆయన కవితకు సంక్రమించినట్లు – తాత్పర్యం.

ఇదొక చమత్కారం. పూర్వకాలంలో చమత్కార సంభాషణ వుండేది మనుష్యుల మధ్య. అది వారి స్నేహానుబంధాలకు గుర్తు. అంతేకాక జీవితం లోని విసుగుదనాన్ని, శుష్కత్వాన్ని పోగొడుతుంది. కనుక చమత్కారంగా అన్నాడాయన. కాగా, కాళహస్తి మాహాత్మ్యంలో శివుడు మిండజంగం దేవరగా వచ్చి ఒక వేశ్యననుభవించిన కథతోనే ఆ కావ్యం ప్రారంభమౌతుంది. పైగా వేరే వారవనితల కథ వస్తుంది. ఇదొక చమత్కారం. శైవమతంలో మిండజంగాల ఆరాధన వుంది. దీన్ని చమత్కరించటం ఆ పద్య తాత్పర్యం. అంతేకాని ఆయనకీ అలవాటున్నదని కాదు.

ఇలా సాహిత్యవిద్యను వ్యాఖ్యానించుకోవాలి తప్ప ప్రతిదీ కవికి అంటగట్టటం విమర్శకలక్షణం కాదు.

(ఈ వ్యాసం శ్రీకాళహస్తి మాహాత్మ్య కావ్యపరిచయానికి ఉపోద్ఘాతం.)